క్లుప్తంగా

డీఎస్సీ మోడల్ టెస్ట్‌లు

నెల్లూరు (టౌన్): డీఎస్సీ టెస్ట్‌లను ఈ నెల తొమ్మిది నుంచి ప్రతి ఆదివారం ఎస్ అండ్ ఎస్ పబ్లికేషన్స్ సహకారంతో నిర్వహించనున్నామని శ్రీహర్ష వాల్మీకి కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మాగులూరి హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సమీపంలోని క్యాంపస్‌లో ఉదయం పది నుంచి 12.30 వరకు నిర్వహించనున్నామని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డయల్ యువర్ డీఎం

నెల్లూరు సిటీ: ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని ఆర్టీసీ కార్యాలయంలో డయల్ యువర్ డీఎం – 2 కార్యక్రమాన్ని మేనేజర్ శివకేశవ్ యాదవ్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురు ఫోన్ చేసి పలు అంశాలను తెలియజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

మట్టి ఖర్చులివ్వకపోవడం దారుణం

నెల్లూరు(అర్బన్): నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో గతేడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో మృతి చెందిన సుమారు 100 మంది పెన్షనర్ల కుటుంబాలకు మట్టి ఖర్చులను ప్రభుత్వం ఇప్పటికీ ఇవ్వకపోవడం దారుణమని ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరికీ రూ 25 వేల మేర రావాల్సి ఉందని, దీన్ని వెంటనే చెల్లించాలని కోరారు.

దాడి ఘటనలో కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఆస్తి విషయంలో నెలకొన్న మనస్పర్థలతో దంపతులపై దాడి చేసిన వారిపై కేసును నవాబుపేట పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నజీర్‌తోటకు చెందిన దామోదర్‌రావుకు తోడల్లుడు కోటేశ్వరరావుకు మధ్య ఆస్తి విషయమై మనస్పర్థలున్నాయి. ఈ క్రమంలో దామోదర్‌రావు అతని భార్యపై కోటేశ్వరరావు అతని బంధువులు రాళ్లతో దాడి చేసి గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను అందజేయనున్నామని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హ్యాండ్, పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్లతో నడిచే బూమ్ టైప్‌తో పాటు పలు పరికరాలను సబ్సిడీపై అందజేయనున్నామని వివరించారు. ఐదెకరాల కన్నా తక్కువ పొలం కలిగిన ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు, మహిళా రైతులకు వీటిని ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలు లేదా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల సమర్పణకు గడువు పొడిగింపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అంబేడ్కర్ గురుకులాల్లో 2025 – 26 విద్యాసంవత్సరానికి దరఖాస్తు గడువును పొడిగించారని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయాధికారి పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి, జూనియర్ ఇంటర్‌కు సంబంధించిన దరఖాస్తు గడువును ఈ నెల 13 వరకు పొడిగించారని చెప్పారు. apbragcet.apcfss.in ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు సమీపంలోని అంబేడ్కర్ గురుకులాలను సంప్రదించాలని సూచించారు.

అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు(బారకాసు): రెవెన్యూ వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, ఇన్‌చార్జి అడ్మిన్ కార్యదర్శులు 22 మందికి షోకాజ్ నోటీసులను కమిషనర్ సూర్యతేజ శుక్రవారం జారీ చేశారు. ఈ నెల ఆరు నాటికి వసూళ్లు సున్నాగా ఉండటంతో వీరికి నోటీసులను జారీ చేశామని చెప్పారు. లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో ప్రభుత్వ మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో 100, 200 మీటర్లు, జావెలిన్ త్రో, లాంగ్‌జంప్, డిస్కస్ త్రో, షాట్‌పుట్, వాలీబాల్, క్యారమ్స్, చెస్, ముగ్గుల పోటీలను శుక్రవారం నిర్వహించారు. జెడ్పీ సీఈఓ విద్యారమ, డీఎస్డీఓ యతిరాజ్, ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మన్నేపల్లి పెంచలరావు, మహిళా విభాగ చైర్‌పర్సన్ ఉదయగిరి చిన్నమ్మ, రామకృష్ణ, ఆంజనేయవర్మ, కరుణమ్మ, లక్కాకుల పెంచలయ్య, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



నారాయణ నర్సింగ్ కళాశాలలో..



డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో..

నెల్లూరు(అర్బన్): నగరంలోని పలు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు తదితరాల్లో ముందస్తు మహిళా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను సత్కరించారు.

• నగరంలోని నారాయణ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ ఫీల్డ్ ఆఫీస్, నెల్లూరు ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. సంస్థ క్షేత్ర ప్రచార సహాయకుడు హరికృష్ణ, కళాశాల డీన్ డాక్టర్ వనజకుమారి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మాధవి, ప్రభుత్వ న్యాయవాది రమాదేవి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): నగరంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. మాజీ మేయర్ భానుశ్రీ, శిరీషా, ప్రతిమ, ముజీర్, సుజన, రేణుప్రియ, శోభ, లలిత, కల్పన, అనిత తదితరులు పాల్గొన్నారు.

• నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. డాక్టర్ విజయలక్ష్మి, ప్యూర్ స్మైల్స్ ఫౌండేషన్ అధినేత్రి పర్వీన్, ప్రిన్సిపల్ గిరి, ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ విజయకళ, సభ్యులు కళాప్రియ, లలిత, తమన్నా, గీత, రంజని, దివ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ భవన్‌లోని స్కాడా కార్యాలయంలో కేక్‌ను మహిళా ఉద్యోగులు కట్ చేశారు. అనంతరం వంటల పోటీలను నిర్వహించారు. మహిళా ఉద్యోగులు తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. ఎస్ఈ విజయన్, ఈఈలు శేషాద్రిబాలచంద్ర, శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ విజిత తదితరులు పాల్గొన్నారు.

• వెంకటేశ్వరపురం, ఇస్లాంపేటలోని సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగులను దివ్యాంగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు నరసాపురం ప్రసాద్, గుమ్మడి శీనయ్య, సచివాలయ సిబ్బంది వీరారెడ్డి, రిజ్వానా, హిమజ, లీలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ: నగరంలోని బొల్లినేని నర్సింగ్ కళాశాలలో కేక్‌ను కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు. డీజీఎం శివమాల, ప్రిన్సిపల్ అశోక్, వినీల, స్రవంతి, శివశ్రీ, వినోదిని, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో..



విద్యుత్ భవన్‌లో..



వెంకటేశ్వరపురంలో..



బొల్లినేని నర్సింగ్ కళాశాలలో..

బర్డ్ ఫ్లూపై ఆందోళన అక్కర్లేదు



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లేదని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. బర్డ్ ఫ్లూపై నగరంలోని వీఆర్సీ మైదానంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. చికెన్ మేళాను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. బర్డ్ ఫ్లూపై ఎలాంటి ఆందోళన అక్కర్లేదని చెప్పారు. చికెన్, గుడ్డు వంటకాలను పంపిణీ చేశారు. ప్రజలతో కలిసి చికెన్ తిన్నారు. అవగాహన కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు.

ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో 120 మైక్రాన్ల కన్నా తక్కువ స్థాయి గల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ, రవాణా, విక్రయం తదితరాలను నిషేధిస్తున్నామని అదనపు కమిషనర్ నందన్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీదారులు, రిటైలర్లు, ఇతర విక్రయదారులతో కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్ణాంధ్ర – 2047 సాధనలో భాగంగా ప్రతి నెలా మూడో శనివారాన స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్‌ను చేపట్టనున్నామని వివరించారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల దుకాణాలపై దాడులను తరచూ చేపడతామని, నిబంధనలను ఉల్లంఘిస్తే భారీ స్థాయిలో జరిమానాలను విధిస్తామని స్పష్టం చేశారు. ఎంహెచ్ఓ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నూతన మార్గదర్శకాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మధుకుమార్

నెల్లూరు(బారకాసు): భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్లపై రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్దేశించిన మార్గదర్శకాలపై అవగాహన పెంచుకోవాలని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ మధుకుమార్ సూచించారు. జీఓ నంబర్లు 3, 4, 5, 20పై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు సిబ్బంది, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు పనిచేయాలని కోరారు. అడిషనల్ కమిషనర్ నందన్, సీపీ పద్మజ, నుడా సీపీఓ హిమబిందు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు వేణు, ప్రకాష్‌బాబు, ఎల్టీపీలు సతీష్‌బాబు, ఎక్స్ అఫీషియో శ్రీనివాసరావు, సీనియర్ ఎల్టీపీ లలితారామ్ తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలి



సూచనలు చేస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరంలోని అన్ని కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టడంతో పాటు రోడ్లపై వ్యర్థాల్లేకుండా వెంటనే తొలగించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరంలోని 13వ డివిజన్లో గల గౌడ హాస్టల్ సెంటర్, బాలాజీనగర్, దర్గా వీధి, బ్యాంక్ కాలనీ, గ్యాస్ గోడౌన్ సెంటర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన 13వ వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శి వెంకటరత్నం, ప్లానింగ్ సెక్రటరీలు మనోజ్, రఘు, అమెనిటీస్ సెక్రటరీ పవన్‌కు మెమోను జారీ చేయాలని సూచించారు. మెయిన్ రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు, వేలాడుతున్న వైర్లను గుర్తించి సంబంధిత కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు కుంగిపోవడాన్ని గమనించిన ఆయన సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులను జారీ చేయాలని చెప్పారు. అనంతరం రామలింగాపురంలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ చైతన్య, హార్టికల్చర్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రఘురామ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రకాష్, సర్వేయర్ కామేశ్వరరావు, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

రంగడి బ్రహ్మోత్సవాల నిర్వహణపై సూచనలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానానికి దేవదాయ శాఖ తిరుపతి రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ శుక్రవారం విచ్చేశారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డికి పలు సూచనలు చేశారు. అనంతరం అర్చకులతో సమావేశమయ్యారు.

మహిళా దినోత్సవ కార్యక్రమం నేడు

నెల్లూరు రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నామని కలెక్టర్ ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం ఉదయం పది గంటలకు ప్రారంభంకానుందని చెప్పారు. పొదుపు మహిళలను సత్కరించనున్నామని పేర్కొన్నారు. బ్యాంక్ లింకేజీ రుణాలు, వివిధ పథకాల కింద ఆస్తుల పంపిణీ తదితరాలను నిర్వహించనున్నామని వెల్లడించారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రాహుకాల ఉద్యాపన పూజను శుక్రవారం నిర్వహించారు. పూజల్లో 76 మంది భక్తులు పాల్గొని, అమ్మవారికి పసుపు, కుంకుమ, 108 నిమ్మకాయల మాలను సమర్పించారు. వేదపారాయణం, సంధ్యామేళం, కుంభహారతులు పల్లకిసేవను నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామ్మూర్తి, ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

నూర్‌బాషాలకు ఎమ్మెల్సీగా అవకాశమివ్వాలి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు రూరల్: నూర్‌బాషాలకు ఎమ్మెల్సీగా అవకాశాన్ని కల్పించాలని నూర్‌బాషా దూదేకుల సాధికార సమితి నెల్లూరు పార్లమెంట్ కన్వీనర్ సుభాన్ బాషా కోరారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబ్జాన్, జిల్లా యువత అధ్యక్షుడు సుభాన్‌బాషా, సంగం మండలాధ్యక్షుడు ఖాజారహంతుల్లా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఖాజామస్తాన్, ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఖాజావలీ, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి అల్తాఫ్, నెల్లూరు సిటీ అధ్యక్షుడు లతీఫ్ పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓకు సత్కారం



నెల్లూరు(అర్బన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ సుజాతను హంస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్ కిరణ్, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు శుక్రవారం సత్కరించారు. అనంతరం పలువురు మహిళా ఉద్యోగులను సన్మానించారు. జిల్లా మాస్ మీడియా అధికారి కనకరత్నం, డీపీఎంఓ రమేష్, స్టాటిస్టికల్ ఆఫీసర్ సహన, ఎన్నార్సీ నోడల్ అధికారి శివరాముడు, ఎపిడమిక్ అధికారి భాస్కర్, నేతలు శ్రీనివాసులు, మజార్, అరవ పరిమళ, మురళి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పరిశీలన



మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలంలో పది ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంపీడీఓ శైలేంద్రకుమార్ పేర్కొన్నారు. ములుమూడి, సౌత్‌మోపూరు, ఆమంచర్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాసులు, తహసీల్దార్ లాజరస్, వ్యవసాయాధికారి నాగమోహన్, ఎంపీడీఓ శుక్రవారం పరిశీలించారు. అనంతరం కందమూరు, గొల్లకందుకూరు, వెల్లంటి గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించారు.

శేషజీవితాన్ని హాయిగా గడపాలి



ఉద్యోగ విరమణ పొందిన వారితో ఎస్పీ తదితరులు

నెల్లూరు(క్రైమ్): పోలీస్ శాఖలో ఎంతోకాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది తమ శేషజీవితాన్ని కుటుంబసభ్యులతో హాయిగా గడపాలని ఎస్పీ కృష్ణకాంత్ కాంక్షించారు. ఏఆర్ ఎస్సై యుగంధర్, ఏఆర్ హెచ్‌సీ శేషయ్య ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో వీడ్కోలు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వీరిని ఎస్పీ ఘనంగా సత్కరించారు. ఏఎస్పీలు సౌజన్య, మునిరాజా, ఎస్బీ, నగర, ఏఆర్ డీఎస్పీలు శ్రీనివాసరావు, సింధుప్రియ, చంద్రమోహన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, ఏపీ పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



నెల్లూరు (టౌన్): నగరంలోని విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని కృష్ణా కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, హైస్కూల్ ఇన్‌చార్జి ఇమ్రాన్, ఈవెంట్స్ నిర్వాహకులు కృష్ణ, అబ్దుల్, త్యాగరాజు, ఆయుర్వేద వైద్యులు శ్యామ్, హర్షవర్ధిని, మురళీకృష్ణ, శీనయ్య, నాగరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వివిధ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ గాంధీ గిరిజన కాలనీ ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో గాంధీ గిరిజన కాలనీ, డాక్టర్స్ కాలనీ, వెంకటేశ్వరపురంలోని పెట్రోల్ బంక్ గుంట, వెంకటేశ్వరస్వామి ఆలయ వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• డీఆర్డీఏ సబ్‌స్టేషన్ పరిధిలోని సండే మార్కెట్, బృందావనం ఫీడర్లలో గల సండే మార్కెట్, ట్రంక్ రోడ్డు, బృందావనం, పొగతోట, కాంప్లెక్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు వరకు.. ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని జేవీఆర్ కాలనీ, సుజాతమ్మకాలనీ, ఆదర్శ్‌నగర్, జిల్లా జడ్జి బంగ్లా, పొదలకూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

• రంగనాథ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇసుకడొంక, రంగనాయకులపేట, కపాడిపాళెం, సంతపేట, రైల్వేఫీడర్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని 22 మందికి రూ.30 లక్షల విలువజేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. నగరంలోని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో వీటిని ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు ద్రోహం



మాట్లాడుతున్న నిర్మల

నెల్లూరు(బారకాసు): కూటమి ప్రభుత్వం మహిళలకు ద్రోహం చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి మల్లి నిర్మల ఆరోపించారు. డైకస్ రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని చెప్పారు. మోసపూరిత హామీలిచ్చి టీడీపీ అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. మహిళా దినోత్సవాన మహిళల ఖాతాల్లోకి ఆడ బిడ్డ నిధి కింద డబ్బులను జమ చేస్తారానని అడిగారు. ఉచిత బస్సు పథకం నేటికీ అతీగతీ లేదని విమర్శించారు. తమ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకూడదనే రూల్ ఎక్కడైనా ఉందానని మంత్రి నారాయణను ప్రశ్నించారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హేళనగా మాట్లాడటం తగదని హితవు పలికారు. హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళకు వందనం



గుళాల ఎత్తు.. నాలుగంగుళాల వెడల్పుతో కళాత్మకంగా తీర్చిదిద్దారు.

నెల్లూరు(బృందావనం): ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సింహపురికి చెందిన కళాకారులు తమ ప్రతిభతో మహిళా లోకానికి కళావందనం తెలిపారు. మూలాపేటకు చెందిన సూక్ష్మ కళాకారుడు గంధవళ్ల ఉమాశంకర్ కదంబం ఆకుపై సింహాసనంపై ఆశీనులైన మహిళ చిత్రాన్ని చెక్కి ఆమె ఉన్నతిని చాటుతూ శుభాకాంక్షలు తెలిపారు.

• భక్తవత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు.. నిత్యావసర సామగ్రిని వినియోగించి నిలువెత్తు మహిళకు రూపమిచ్చారు. పెసలపప్పు, కంది గింజలు, పచ్చిశనగపప్పు, మిరియాలు, నల్లబియ్యం, ఫెవికాల్‌ను ఉపయోగించి తొమ్మిదం

ఉత్సవంపై దాడి హేయం

నెల్లూరు రూరల్: అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ నెల నాలుగున నిర్వహిస్తున్న వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంపై కొందరు దాడికి తెగబడటం హేయమని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అప్పల శ్రీధర్ పేర్కొన్నారు. నగరంలోని జర్నలిస్ట్ భవన్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. టౌన్‌హాల్ నుంచి ర్యాలీగా సోమవారం బయల్దేరి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని వీహెచ్‌పీ ఆధ్వర్యంలో అందజేయనున్నామని చెప్పారు. నేతలు శశికుమార్, గోపీనాథ్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.